క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ రామగిడ్డయ్య

ప్రొద్దుటూరు రూరల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్యాధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌తో ఈహెచ్ఆర్ నమోదు గురించి, మందుల కొరతపై ఆయన ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో నెలకు కనీసం 5 కాన్పులైనా చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, ఇన్‌చార్జి స్టాఫ్‌నర్స్ రాధా, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజినీరింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో మున్సిపాలిటీలోని ఆయా విభాగాల సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పైపులైను లీకేజీలు, మరమ్మతులు వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. అలాగే పట్టణంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షించాలని, అలాగే నాణ్యత లోపించకుండా చూడాలని కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో వీధిలైట్ల సమస్య ఉన్నట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈఈ సుమన్‌రెడ్డి, మేనేజర్ సుధీర్, ఏఈలు మహేష్, బాబు, ఆయా సచివాలయాల అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విశ్వ వీక్షణకు విశేష స్పందన



టెలిస్కోప్ ద్వారా విశ్వాన్ని వీక్షిస్తున్న విద్యార్థి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వ వీక్షణకు విశేష స్పందన లభించింది. ఆరు రోజుల నుంచి రోజూ సాయంత్రం జూపిటర్, వీనస్, మార్స్ గ్రహాలను ప్రజలు వీక్షిస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర ఆహ్వానితులు మహేష్ వివిధ గ్రహాలు, వాటి ఉప గ్రహాల గురించి వివరించారు. విద్యార్థులు గ్రహాలను తిలకించడం పట్ల సైన్స్ పట్ల ఆకర్షితులవుతారని, వారిలో ప్రయోగాలు చేయాలనే ఆలోచనలు పెరుగుతాయని తెలిపారు. సుమారు 2000 మందికిపైగా ఈ విశ్వ వీక్షణాన్ని వీక్షించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ గుప్తా, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, నాయకులు ఉషారాణి, రాజశేఖర్, అక్షిత, హేమలత, రాజేష్, విశ్వనాథ్, అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి



సిద్దుగారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

బి.కోడూరు : మండలంలోని సిద్దుగారిపల్లె గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి కౌశిక పెసర పంటను పరిశీలించి, సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ఈ-పంట నమోదు, ఈకేవైసీకి మార్చి 3వ తేదీ వరకు గడువు ఇచ్చినందున రబీలో రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. పీఎంకిసాన్, వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ తప్పనిసరి అని కావున నమోదు చేసుకోని రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యం.. ఉత్తమ ఫలితం



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

- త్వరలో పదో తరగతి పరీక్షలు
- అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విద్యార్థులు
- ప్రత్యేకంగా బోధిస్తున్న ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో.. విద్యార్థులు సబ్జెక్ట్‌లపై పూర్తి పట్టు సాధించడంలో నిమగ్నమయ్యారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందేందుకు శ్రమిస్తున్నారు. విద్యాశాఖ రూపొందించిన యాక్షన్ ప్లాన్ అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రొద్దుటూరు మండలంలో మున్సిపల్, జెడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 21 ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు ఆదేశించిన యాక్షన్ ప్లాన్‌ను డిసెంబర్ 1న ప్రారంభించారు. ఇందులో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించడంతోపాటు ఆదివారం, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులను చదివిస్తున్నారు.

వారాంతాల్లో టెస్ట్

పరీక్షలు నిర్వహించడంతోపాటు సబ్జెక్టులపై విద్యార్థులకు ఉన్న అనుమానాలను నివృతి చేస్తున్నారు. వారాంతాల్లో గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులయ్యేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

సాక్షి దినపత్రిక స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రొద్దుటూరు మండలంలోని అనిబిసెంట్, డీబీసీఎస్, నడింపల్లె, ఎస్పీసీఎస్, వసంతపేట, సెంకడ్‌వార్డ్, వైవీఎస్, మోడంపల్లె, కొత్తకొట్టాల హైస్కూల్, కల్లూరు, తాళ్లమాపురం, దొరసానిపల్లె, ఖాదర్‌బాద్ జెడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ హైస్కూళ్ల ఎస్‌వీపీ బాలుర, బాలికల హైస్కూల్, రమణమహర్షి, కొట్టి, ఓరియంటల్, జెడ్పీహెచ్ఎస్ అమృతానగర్ తెలుగు, ఉర్దూ, జెడ్పీహెచ్ఎస్ కొత్తపేట పాఠశాలలు మొత్తం 21 పాఠశాలలకు చెందిన 1333 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు తమ పాఠ్యాంశాల్లో మంచి మార్కులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలు సమీపిస్తుండటంతో టీవీలు చూడకుండా చదువుపై శ్రద్ధ వహించేలా తల్లిదండ్రులు చూడాలని సూచిస్తున్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం సాక్షి దినపత్రిక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధకనబరిచి వారు ఉత్తీర్ణులయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏ సబ్జెక్టుల్లో వారు వెనుకబడి ఉన్నారో ఆ ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– బి.సుశీల, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు, వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్

ఎక్కువ మార్కులు సాధిస్తా



పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేందుకు బాగా చదువుతున్నాను. ఉపాధ్యాయులు మమ్మల్ని బాగా చదివిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్ నిర్వహించడంతోపాటు సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

– దివ్యశ్రీ, విద్యార్థిని, వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్, ప్రొద్దుటూరు

కష్టపడి చదువుతున్నా



పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నాను. పరీక్షలు నిర్వహించి తప్పులను ఉపాధ్యాయులు తెలియ చేస్తున్నారు. ఎక్కువ మార్కులు పొంది ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తాను.

– చాతుర్య, వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని, ప్రొద్దుటూరు

పేదల స్థలాలపై పెద్దల కన్ను

- బాధితుల ఆవేదన



మాట్లాడుతున్న డాక్టర్ ప్రమీళ రంగారెడ్డి కాలనీ ప్లాట్ల యజమానులు

ప్రొద్దుటూరు రూరల్ : పేదలు రూపాయికి రూపాయి కూడబెట్టుకుని కొనుగోలు చేసిన ప్లాట్లకు ప్రస్తుతం ధరలు రావడంతో ఆక్రమించేందుకు కొంత మంది పెద్దలు, రాజకీయ నాయకుల కన్ను పడిందని డాక్టర్ ప్రమీళ రంగారెడ్డి కాలనీ ప్లాట్ల యజమానులు వాపోయారు. మడూరు రోడ్డులోని ప్రమీళ రంగారెడ్డి కాలనీ వద్ద గురువారం వారు మీడియాతో మాట్లాడారు. గత 25 ఏళ్ల కిందట ప్రమీళ రంగారెడ్డి పేరుతో 1300 ప్లాట్లతో లింగాపురం గ్రామానికి చెందిన శీలం కోటిరెడ్డి అనే వ్యక్తి వెంచర్ వేశారన్నారు. అప్పట్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోగా, మరికొందరు కంతుల వారీగా చెల్లించి కొనుగోలు చేశారన్నారు. అయితే అందులోని 70 ప్లాట్లలో గత కొద్ది రోజులుగా కొందరు అక్రమార్కులు ప్లాట్ల రాళ్లను తొలగించి చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ స్థలాల్లో రోడ్లు వేసేందుకు గ్రావెల్, ఐదు సెంట్ల ప్లాట్లుగా విభజించేందుకు నంబర్ రాళ్లను వేశారన్నారు. గతంలో రిజిస్ట్రార్ అయిన సర్వే నంబర్లను ప్రస్తుతం రెవెన్యూ అధికారుల ద్వారా సబ్ డివిజన్ చేయించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఇతర అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

నా హస్తం ఉందని చెప్పడం బాధాకరం

ప్రమీళ రంగారెడ్డి వెంచర్‌లోని 70 ప్లాట్లను ఆక్రమించారని, తన పేరు బహిర్గతంగా చెప్పడం బాధాకరమని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. అక్కడ ఉన్న బాధితులను ఆయన కలిసి తమ గ్రామ పంచాయతీలో ఇలాంటివి జరగడం బాధాకరమన్నారు. బాధితులకు అండగా నిలబడి న్యాయం చేస్తానన్నారు. పేదల ప్లాట్లు చదును చేయడం, గ్రావెల్ తోలిన విషయంలో తన పాత్ర లేదన్నారు. మీడియాతో మాట్లాడిన వారిలో ప్లాట్ల యజమానులు మొహిద్దీన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, గుర్రప్ప, రఫి ఉన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు సీజ్

ప్రొద్దుటూరు : స్థానిక కోనేటి కాలువ వీధిలోని పలు ప్లాస్టిక్ దుకాణాలపై గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సుమారు 200 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, గ్లాసులను వాడకూడదని, అమ్మకూడదని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ బాషా, సుబ్బరాయుడు, సచివాలయ కార్యదర్శులు కరుణశ్రీ, మాధవిరెడ్డి, రాజశేఖర్, పాపారాయుడు పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ



అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న శ్రీనివాసులస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ పెట్రోల్ బంకు సమీపంలో గురువారం అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 400 మందిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ముందుగా కాలభైరవస్వామి విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో అలంకరించారు. కాలభైరవ స్వామి ఉపాసకులు శ్రీనివాసుల స్వామి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెద్ద మల్లికార్జున, చంద్రశేఖర్, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద మౌలిక వసతులు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు

ప్రొద్దుటూరు : రంజాన్ మాసం మార్చి 2 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలో మసీదులు ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వారు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు నూరి, పీఎస్ చాంద్ బాషా మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు ఉంటారని తెలిపారు. మసీదులు ఉండే ప్రాంతాల్లో రోజు కమిషనర్ స్వయంగా పారిశుధ్య పనులను పర్యవేక్షించి, ఆ ప్రాంతాలను శుభ్రం చేయించాలని కోరారు. తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు తాగునీటిని అందించాలని తెలిపారు. వీధి లైట్లను పరిశీలించి, పని చేయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. 25వ వార్డులో మట్టి మసీదు, ఉస్మాన్ మసీదులు ప్రధానమైనవని, మసీదుల పక్కన ఉన్న కొత్తపల్లె కాలువ నుంచి తీసిన వ్యర్థాలను అక్కడే వేస్తున్నారని చెప్పారు. దీనివల్ల పందుల బెడద ఎక్కువైందని, మసీదులకు నమాజు కోసం వచ్చే ముస్లింలకు అసౌకర్యంగా ఉందన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ హుస్సేన్, మహబూబ్ బాషా, జిలాన్, ఇమ్రాన్, గఫార్, జాఫర్, చౌసేన్, షకీల్, హబీబ్, రఫిక్, నాయబ్ రసూల్, అల్తాఫ్, రామారావు, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. మైదుకూరు రోడ్డులోని బాలాజీ నగర్–2 వద్ద ఉన్న చెత్తపాయింట్‌ను పారిశుధ్య కార్మికులచే కమిషనర్ శుభ్రం చేయించారు. వైఎంఆర్ కాలనీలోని నారాయణ స్కూల్ వద్ద కాలువలో పేరుకుపోయిన సిల్ట్‌ను, వసంతపేటలోని సాయిబాబా గుడి వద్ద ఉన్న కాలువలో పేరుకుపోయిన సిల్ట్‌ను కార్మికులతో తొలగించారు. రాజరాజేశ్వరి అపార్ట్‌మెంట్‌లో ప్రజలకు ఆన్‌సైట్ కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించాలని శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. రామేశ్వరం దేవాలయాల వద్ద పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.నూర్ బాషా పాల్గొన్నారు.

రైతులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్య



రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ

అట్లూరు : భూమి కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలోని చింతలచెరువు, అట్లూరు మండల పరిధిలోని కుంభగిరి రైతు సేవా కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రైతు సేవాకేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న పైర్లను పరిశీలించి చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. అలాగే భూమి కలిగిన రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీలు అందాలన్నా రుణాలు మంజూరు కావాలన్నా, రాయితీ విత్తనాలు పొందాలన్నా ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు సందీప్‌కుమార్, పవన్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రొద్దుటూరు : స్థానిక సూపర్ బజార్ రోడ్డులో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, కాలేజీలు పార్కింగ్ స్థలం లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీకి వైఎస్సార్‌సీపీ నాయకుల సత్కారం



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం బద్వేలు మండల సీనియర్ నాయకుడు క్లాస్ కాంట్రాక్టర్ రమణారెడ్డి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, పుట్టాయపల్లె సర్పంచ్ జయరాంరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జిల్లా అనుబంధ నాయకులు, పోరుమామిళ్ల మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పది విద్యార్థులకు అవగాహన

బి.కోడూరు : బి.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్ఆర్‌హెచ్‌ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల గురించి సలహాలు, సూచనలు, వారు భవిష్యత్తులో ఏ కోర్సులు చేస్తే ఎటువంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయో చాట్ రూపంలో అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం ఉంటుందని వివరించారు.

ముగిసిన మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవానికి ముస్తాబైన మల్లెంకొండేశ్వరస్వామి

గోపవరం : మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లెంకొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. జిల్లాతోపాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడం జరిగింది. బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున కొండపైన స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు అన్ని వసతులు సమకూర్చారు. దాతల సాయంతో తాగు నీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంతంగా బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లలో పాలుపంచుకున్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఖాజీపేట : మహా శివరాత్రిని పురస్కరించుకుని ఖాజీపేటలోని శివాలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. నాగనాథేశ్వరస్వామి కొండపై కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కనులారా వీక్షించి తరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు.

రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

బద్వేలు అర్బన్ : శివరాత్రి సందర్భంగా లంకమల రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను గురువారం పట్టణంలోని దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ఆ శాఖ సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ సమక్షంలో సిబ్బంది లెక్కించారు. ఇందులో తాత్కాలిక హుండీ ద్వారా రూ.1,66,420 వచ్చినట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు కల్యాణ కానుక ద్వారా రూ.3,17,580లు, రూ.10 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.36,850లు, రూ.50 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,09,750లు, తలనీలాల టిక్కెట్ల ద్వారా రూ.8,400లు చొప్పున మొత్తం రూ.6,54,000లు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యం



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

ప్రొద్దుటూరు : కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని, వెంటనే చెల్లించకపోతే తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను గురువారం వారు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు పనులకు సంబంధించి సుమారు రూ.25 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు చెబితే వెంటనే కమిషనర్‌లు స్పందించి బిల్లులు మంజూరు చేసేవారన్నారు. ఏడాది కాలంగా తమ బిల్లులు అప్రూవ్ అయినా కూడా.. తమకు డబ్బు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు బిల్లులు రావాల్సిన కాంట్రాక్టర్లు ఉన్నారన్నారు. ఇలా అయితే మళ్లీ పనులు చేయలేమని తెలిపారు. కాంట్రాక్టర్లకు సంబంధించిన ఈఎండీ బకాయిలను అధికారులు చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సిన మాట వాస్తవమేనన్నారు. మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా జాప్యం జరుగుతోందన్నారు. రూ.19 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని, మార్చి ఆఖరు నాటికి వసూలు చేసి ఏప్రిల్ రెండో వారం నాటికి బిల్లులు చెల్లిస్తామన్నారు. పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ఈఎండీలు కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. మున్సిపాలిటీ బడ్జెట్‌కు మించి గతంలో పనులు చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. మోడంపల్లి పీహెచ్‌సీ కాంట్రాక్టు పనులను రద్దు చేయాలని కాంట్రాక్టర్ కృష్ణార్జునరెడ్డి కమిషనర్‌కు తెలపగా.. తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని, తాను స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శౌరెడ్డి, బద్వేలి ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నిజాం, ప్రతాప్ యాదవ్, సందీప్, చంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజా, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ సన్యాసం చేసిన పోసానిపై కేసులు దారుణం



రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : 'రాజకీయాలను వదిలేస్తున్నాను.. నాకు నా కుటుంబమే ముఖ్యం' అని చెప్పి రాజకీయాలకు దూరంగా ఉంటున్న సినీ నటుడు పోసాని కృష్ణ మురళీపై కేసులు నమోదు చేయడం దారుణమని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తోపాటు టీవీ 5 అధినేత బీఆర్ నాయుడుపై విమర్శలు చేస్తే పదుల సంఖ్యలో వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదు చేయడం సరైంది కాదని అన్నారు. ఒక కేసులో అరెస్ట్ అయితే బెయిల్ వస్తే.. మరొక కేసులో అరెస్ట్ చేసి పోలీస్ కస్టడీకి తీసుకోవడం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందని అన్నారు. పోసాని ఆరోగ్యం బాగ లేదని చెబుతున్నా, కనీసం మందులు తీసుకుని వెళ్లాలని కుటుంబ సభ్యులు చెబుతున్నా వినకుండా పోలీసులు అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. మరో వైపు మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిపై కూటమి నేతలు ఇదే విధంగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. వారిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం పోలీసుల ఏకపక్ష ధోరణికి నిదర్శనం అన్నారు. వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయరా అని అన్నారు. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరొక న్యాయమా అని ప్రశ్నించారు. పోసాని కుటుంబానికి మాజీ సీయం జగన్ ధైర్యం చెప్పి, వారికి అండగా పార్టీ ఉంటుందని భరోసా కల్పించడం సంతోషకరం అన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



ప్రొద్దుటూరు : ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు



బద్వేలు అర్బన్ : ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పట్టణ అభివృద్ధి సొసైటీ నాయకులు

ప్రొద్దుటూరు : స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానికంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తితో విద్యార్థి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆజాద్ తన 30 ఏళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, సీఐటీయూ కార్యదర్శి రాఘవ, డీవైఎఫ్ఐ సభ్యులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం

బద్వేలు అర్బన్ : దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం చంద్రశేఖర్ ఆజాద్ అని బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక అధ్యక్షుడు బి.గురుమూర్తి అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి సందర్భంగా గురువారం బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు కొండపల్లి చిన్నసుబ్బారావు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, కార్యదర్శి సత్తార్, నాగార్జున, బాలగురన్న, ఆవాజ్ కమిటీ కార్యదర్శి అన్వర్‌బాషా, సీనియర్ దళిత నాయకుడు మునెయ్య తదితరులు పాల్గొన్నారు.